సాక్షి
విశాఖపట్నం
ఆదివారం : 16 : ఫిబ్రవరి : 2025



జీబీ సిండ్రోమ్ రోగులకు మెరుగైన వైద్యం 8లో



ఘనంగా రాధాకృష్ణ మహోత్సవాలు 8లో



మత్తులో పడితే జీవితాలు చిత్తు 8లో

సలాం.. బేగం

క్యాన్సర్‌ను ఓడించిన ఫిట్‌నెస్ ట్రైనర్

ఓటమిని అంగీకరించని ఫర్జానా బేగం

ఎన్ని మేఘాలొచ్చినా..ఆకాశం కదలదు..ఎన్ని తుఫానులైనా..సముద్రం నిలిచిపోదు.. ఎదురయ్యే బాధలన్నీ..ఎగసి పడే తరంగాలే..ఆపదల గాలి ఎంత వేగంగా వీచినా, దృఢమైన మనసు చలించదు. కోల్పోయినవేమీ కన్నీటి కథలవ్వవు..ఎలాంటి కష్టాలు ఎదురొచ్చినా ధైర్యం చేతిలో తలవంచక తప్పదు..నీ ధైర్యమే నీ గెలుపు పతాకం.. తట్టుకొనే శక్తి ముందు, ఏ గెలుపైనా తక్కువే. వాడిపోయిన పువ్వుల్లా రాలిపోతాయి..కష్టానికి పూచే పూలే నిజమైన..విజయాలై వికసిస్తాయి. అచ్చం ఫర్జానా బేగంలా..క్యాన్సర్ వచ్చిందని ఆమె కుంగిపోలేదు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసింది. ఆమె సంకల్పం ముందు క్యాన్సర్ ఓడిపోయింది.

– ఏయూక్యాంపస్



SUNDAY SPECIAL

ఆనందంగా..ఆరోగ్యకరంగా సాగుతున్న జీవితం. శారీరక వ్యాయామ, పోషకాహార నిపుణురాలిగా అందరికీ సూచనలిచ్చే వ్యక్తి. ఇద్దరు కుమార్తెలతో సంతోషంగా సాగుతున్న కుటుంబం. ఒక్కసారిగా ఆమె శరీరంలోకి క్యాన్సర్ మహమ్మారి ప్రవేశించింది. భయపడిన ఆమె వైద్యులు చెప్పిన మాట విని అంతలోనే తేరుకుంది. మనోధైర్యాన్ని సడలనివ్వలేదు. క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొంది. వైద్యుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగింది. కాన్సర్ బారిన పడి దానిని అధిగమించి నూతన జీవితాన్ని పొందాలనేవారికి స్ఫూర్తిగా నిలిచారు..నగరానికి చెందిన ఫిట్‌నెస్ ట్రైనర్ ఫర్జానా బేగం.



ఆనందంగా సాగుతున్న జీవితంలో..

గృహిణిగా తన కుటుంబాన్ని, సొంత ఫిట్‌నెస్ సెంటర్‌ను నిర్వహిస్తూ ఆనందంగా సాగుతున్న బేగం జీవితంలో 2017 నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి. షోల్డర్ పెయిన్‌తో వైద్యుల వద్దకు వెళ్లిన ఆమె ఎంఆర్‌ఐ లో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. ఆ ట్యూమర్ రిబ్స్‌లోని వెళ్లినట్లు వైద్యులు గుర్తించారు. వైద్యులు సర్జరీ చేశారు. అనంతరం 2019లో తిరిగి తీవ్రమైన ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరారు. ఆమె ఛాతీ పక్కటెముకలు రెండూ ట్యూమర్ కారణంగా పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులుగుర్తించారు. వైద్యులు బయాప్సీ చేసి క్యాన్సర్‌గా నిర్ధారించారు.



ధైర్యం కోల్పోలేదు

తొలుత కాస్త భయపడినా కొద్దిరోజుల్లోనే ఆత్మస్థైర్యంతో ధైర్యంగా చికిత్సకు వెళ్లారు. కిమో థెరపీ తీసుకున్నారు. కిమో థెరపీ పర్యవసనాలు ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలను చవిచూశారు. వాటన్నింటినీ భరిస్తూ, అధిగమిస్తూ పూర్తిస్థాయిలో చికిత్స తీసుకున్నారు. మనసునిండా మనోబలం, దైవంపై నమ్మకంతో చికిత్సకు సానుకూల ఆలోచనలతో వెళ్లారు. అదే సమయంలో తనకు సంబంధించిన ఫిట్‌నెస్ జిమ్‌లో తన వృత్తిని యథావిధిగా కొనసాగించారు.

కష్టం వచ్చినప్పుడు పోరాడాలి

ఇద్దరు కుమార్తెలకు తాను ఒక ఉదాహరణగా నిలవాలని ఫర్జానా నిర్ణయించుకున్నారు. కష్టం వచ్చినపుడు పోరాడాలని, ఎప్పుడూ వెనకడుగు వెయ్యకూడదని భావించి, ఆచరణలో చూపారు. సమస్యలు జీవితంలో నిత్యం వస్తుంటాయని, పోరాటం మానకూడదంటారు ఫర్జానా. నేను గెలవాలి అనే బలమైన ఆకాంక్ష సంపూర్ణ ఆరోగ్యంతో తయారయ్యేలా చేసిందన్నారు. నేడు ఎందరో క్యాన్సర్ బాధితులకు ఆమె జీవితం ఒక స్ఫూర్తిదాయక పాఠం. ఇటీవల ఆమె బాలకృష్ణ నిర్వహించే అన్‌స్టాపబుల్ షోలో కూడా పాల్గొని తన జీవిత ప్రయాణాన్ని, క్యాన్సర్‌ను జయించిన విధానాన్ని ప్రజలతో పంచుకున్నారు.

వారే నా ధైర్యం

క్యాన్సర్ వచ్చిందని తెలిసిన సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, తన వద్ద శిక్షణ తీసుకున్న ఫిట్‌నెస్ ట్రైనర్లు అందించిన మానసిక స్థైర్యం వ్యాధి నుంచి త్వరగా కోలుకొనేలా చేసింది. మానసిక ఆరోగ్యం దెబ్బతినకుండా, మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగడం వలనే త్వరగా కోలుకోవడం సాధ్యపడింది. అదే సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన స్థైర్యం మరవలేనిదని ఆమె చెప్పారు. చికిత్స సమయంలో రోజుకో విధంగా శరీరం స్పందించడం, అనేక సందేహాలు రావడం జరిగేది. వీటిని వైద్యులకు వివరిస్తూ వారి సూచనలను స్వీకరిస్తూ ముందుకు సాగారు.



నాచుగ్గా..



పెందుర్తి మండలం చీమలాపల్లి గ్రామంలో ఓ చెరువు పచ్చని తివాచీగా మారింది. సగానికిపైగా నాచు ఏర్పడింది. చూపరులకు వింత అనుభూతిని మిగిల్చింది. ఈ ఆకర్షణీయ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. -ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నగర శుభ్రతే లక్ష్యం

'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్'లో కలెక్టర్ హరేందిర ప్రసాద్



తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

మహారాణిపేట: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుందామని, ఆరోగ్యకర, ఆహ్లాదకర వాతావరణంలో పని చేద్దామని స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. నగర శుభ్రతే లక్ష్యంగా అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ఇతర సంస్థల పరిధిలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేశారు. గార్డెన్‌లోని పిచ్చి మొక్కలను తొలగించారు. తడి– పొడి చెత్తను వేర్వేరు చేస్తూ డస్ట్ బిన్లలో వేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ఆవశ్యకతను తెలుపుతూ పోస్టర్లు ప్రదర్శించారు. ప్రమాదకర వ్యర్థాలను, తడి-పొడిచెత్తను ఎలా వేరు చేయాలి, ఎలా తరలించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేకరించిన వ్యర్థాలను వేర్వేరు డబ్బాల్లో వేసి తరలించాలని పేర్కొన్నారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ప్రత్యేక ఉప కలెక్టర్ శేష శైలజ, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఇతర సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్

మౌలిక వసతుల కల్పనలో రాజీ పడొద్దు

జీవీఎంసీ అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ హరేందిర ప్రసాద్

డాబాగార్డెన్స్: నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో జీవీఎంసీ అధికారులు సమష్టిగా పని చేయాలని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం తన చాంబర్లో జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పక్కాగా వ్యర్థాల సేకరణ జరగాలని, డ్రైనేజీలు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో, డ్రైనేజీల్లో వ్యర్థాలు వేసే వారిని గమనించి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులను చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు, జోనల్ కమిషనర్లు సంయుక్తంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల ఖాళీ స్థలాన్ని డెబ్రిస్‌తో కప్పి, విస్తరణ చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు.మురుగు కాలువ గూండా వెళ్లే తాగునీటి పైపులైన్లు గుర్తించి, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. నగరంలో వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశించారు. మార్చి 31 నాటికి రావాల్సిన రూ.100 కోట్ల పన్నులు వసూలు చేయాలని డీసీఆర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

నిర్ణీత గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: నిర్ణీత కాలపరిమితిలోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శనివారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణ–2020 పథకానికి సంబంధించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి మార్చి 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చినట్లు చెప్పారు. వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రహదారులు, కల్వర్టులకు సంబంధించిన నిరభ్యంతర పత్రాలను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని చెప్పారు. అలాగే ఎల్‌టీపీల వ్యక్తిగత లాగిన్‌లో అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. షార్ట్‌ఫాల్ ఉన్న దరఖాస్తుల విషయంలో కూడా అవసరమైన సంబంధిత దస్త్రాలను వీఎంఆర్‌డీఏకు అందించి దరఖాస్తులను వేగంగా క్లియర్ చేసే విధంగా సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో సీయూపీ శిల్ప, ప్లానింగ్ అధికారులు చామంతి, అరుణవల్లి, మౌనిక, కిషోర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సంకల్ప'లో క్రీడా వేడుక



సంకల్ప వార్షిక క్రీడా దినోత్సవంలో పాల్గొన్న లాబోనీ సక్సేనా

సింధియా : తూర్పు నావికాదళ పరిధిలోని ప్రత్యేక విద్య, సలహా కేంద్రం విశాఖపట్నంలోని సంకల్ప వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి లాబోనీ సక్సేనా, వైస్ ప్రెసిడెంట్ ఎన్‌డబ్ల్యూడబ్ల్యూఏ (ఈఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శక్తివంతమైన ఎనర్జిటిక్ ఏరోబిక్ డిస్‌ప్లేలు, రిలే రేసులు, ఆటలు పలువుర్ని ఆకర్షించాయి. ఈ విధంగా విద్యార్థుల సామర్థ్యాలను ప్రదర్శించే విధంగా శిక్షణ ఇచ్చిన సిబ్బందిని, విద్యార్థుల తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

రుషికొండ బీచ్ ఉద్యోగులకు జీతాల్లేవ్..

- మూడు నెలలుగా అందని జీతాలు
- విధులు బహిష్కరించిన 38 మంది ఉద్యోగులు
- ఉద్యోగాలు తొలగిస్తామని అధికారుల హెచ్చరికలు



నిరసన తెలుపుతున్న సిబ్బంది

కొమ్మాది: బ్లూఫ్లాగ్ బీచ్‌గా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌లో పనిచేస్తున్న చిరుద్యోగులు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడంతో శనివారం నిరసన బాట పట్టారు. మూడున్నర నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, జీతాల కోసం ఎదురుచూస్తూ విసిగిపోయామని వాపోతున్నారు. జీతాలు కోసం అధికారులను అడిగితే.. 'జీతాల్లేవ్. ఉప్పర మీటింగ్‌లు పెట్టి జీతాలు అడిగితే ఉద్యోగాల నుంచి తొలగించేస్తాం.'అంటూ తమపై చిందులు తొక్కుతున్నారని ఆరోపించారు.

రుషికొండ బీచ్‌లో 38 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 8 మంది టికెట్ కలెక్టర్లు, 9 మంది సెక్యూరిటీ గార్డులు, 13 మంది బీచ్ క్లీనర్లు, నలుగురు లైఫ్ గార్డ్స్, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషియన్, ఫస్ట్ ఎయిడ్ ఉద్యోగి ఉన్నారు. వీరే లేకపోతే బీచ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతుంది. పర్యాటకుల భద్రత ప్రమాదంలో పడుతుంది. తక్కువ జీతాలతో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తున్నప్పటికీ, నెలల తరబడి జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను టూరిజం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో శనివారం విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. విధులకు హాజరు కాకుండా ఆందోళన చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని సంబంధిత అధికారులు వారిని హెచ్చరించారు. అయినప్పటికీ ఉద్యోగులు వెనక్కి తగ్గకుండా నిరసన కొనసాగించారు. 'మా జీతాలు చెల్లించి.. ఆ తర్వాత ఉద్యోగాలు తీసేయండి'అని ఉద్యోగులు స్పష్టం చేశారు. జీతాలు చెల్లించే వరకు విధులకు హాజరుకాబోమని తేల్చి చెప్పారు.

ఆర్డీ అత్యుత్సాహం

రుషికొండ బీచ్‌లో గతంలో ప్రవేశ టికెట్ కలెక్టర్లుగా 8 మంది విధుల్లో చేరారు. అయితే రీజినల్ డైరెక్టర్ రమణారావు అత్యుత్సాహంతో వీరిని బీచ్ క్లీనర్లుగా మార్చారు. కాస్తోకూస్తో చదువుకున్న వీరిని బీచ్ క్లీనర్లుగా మార్చడంపై విమర్శలు వచ్చాయి. ఇదేంటని ప్రశ్నించిన వారిని 'నచ్చితే ఉద్యోగంలో కొనసాగండి.. లేకుంటే మానేయండి'అంటూ ఆర్డీ హెచ్చరించారు. దీంతో చేసేదేమీ లేక మనసు చంపుకుని బీచ్ క్లీనింగ్ పనులు చేస్తున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నెలలు గడుస్తున్నా.. జీతం అందకపోవడంతో తమ గోడు ఎవరికి వెళ్లబోసుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లల చదువు మాన్పించేశాం



మూడు నెలల నుంచి జీతాలు లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. జీతం ఎప్పుడిస్తారని అడిగితే రేపు, ఎల్లుండి అంటూ దాటవేస్తున్నారు. దీంతో అప్పులు చేసి మరీ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. పిల్లల బడి ఫీజులు కట్టలేక చదువు మాన్పించేశాం.

– కల్యాణి, ఉద్యోగి

ఇల్లు ఖాళీ చేసేశాం



మేము అద్దె ఇంట్లో ఉంటున్నాం. మూడు నెలల నుంచి జీతం అందక అద్దె ఇవ్వకపోవడంతో.. ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయమన్నారు. చేసేదేమీ లేక ఇల్లు ఖాళీ చేసేశాం. మా బతుకులు రోడ్డెక్కాయి. జీతాలు అడిగితే ఉద్యోగం మానేమంటున్నారు. మా బాధ ఎవరితో చెప్పుకోవాలి.

– జి.రత్న, ఉద్యోగి



మెరుగైన జీవనశైలితో క్యాన్సర్‌కు చెక్

- వ్యాధిపై విస్తృత అవగాహన అవసరం
- సినీ నటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి
- నేడు బీచ్‌రోడ్డులో పింక్ సఖి శారీ వాక్

8లో

ఇసుక.. ఎవరూ కొనట్లే.!

ముడసర్లోవ స్టాక్ పాయింట్‌లో 2,840 టన్నుల ఇసుక నిల్వలు



ముడసర్లోవ వద్ద ప్రభుత్వ డిపోలో ఇసుక

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్‌కు వినియోగదారుల నుంచి స్పందన కరువైంది. ఇక్కడ నుంచి ఇసుక కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక గత ఏడాది డిసెంబర్ 12న ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా గార ఇసుక రీచ్ నుంచి లారీలతో ఇక్కడకు 3,480 టన్నుల ఇసుక తీసుకు వచ్చి నిల్వ ఉంచారు. అయితే ఇక్కడ ఇసుక విక్రయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇంతవరకు కేవలం 640 టన్నుల ఇసుక మాత్రమే ఇక్కడ విక్రయించారు. ఈ లెక్క ప్రకారం రోజుకు సుమారు 11 టన్నుల ఇసుక చొప్పున వినియోగదారులు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ 2,840 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు ఇక్కడ ఇసుక కొనుగోలు చేయకుండా ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. కారణం ధరలో వ్యత్యాసమే.! ఇసుక స్టాక్ పాయింట్‌లో టన్ను రూ.700కు విక్రయిస్తుండగా, ప్రైవేట్ వ్యాపారుల వద్ద టన్ను రూ.650కే లభిస్తోంది. అందుకే ఇటు వైపు రావడం లేదు. బిల్లుతో పాటు కొలతలో ఎటువంటి తేడా లేకుండా విక్రయిస్తామని చెబుతున్నా.. ఈ స్టాక్ పాయింట్ వైపు రాకపోవడం గమనార్హం.

'ప్రతి ఇంటా శ్రీ మహాగణపతి లక్ష మోదక యజ్ఞం జరగాలి'


ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ

ఎంవీపీకాలనీ: శ్రీ మహా గణపతి వైభవం పై బ్రహ్మశ్రీ సామ వేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఋషిపీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్‌–6లోని భద్రం పార్క్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ.. లోక కల్యాణం కోసం ప్రతి ఇంటా శ్రీ మహాగణపతి లక్ష మోదక యజ్ఞం జరగాలన్నారు. ఆ యజ్ఞం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం వివిధ గణపతులకు ప్రత్యేక పూజలు ఎలా చేయాలో వివరించడంతో పాటు వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని తన ప్రవచనాల ద్వారా తెలియజేశారు. నిర్వాహకులు కె.వి.ఎస్‌ శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

'నోటీసులు వెనక్కి తీసుకోండి'

సీతంపేట: వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాను బెదిరిస్తారా అని దళిత, ప్రజా, జర్నలిస్ట్‌ సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. ఓ పత్రికా సంపాదకుడికి విశాఖ ఆర్డీవో శ్రీలేఖ నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే అని మండిపడ్డారు. ద్వారకానగర్‌ పౌరగ్రంథాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వాక్‌ స్వాతంత్య్రాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను హరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, న్యాయవాది కె.పద్మ, ప్రజా సంఘాల నాయకులు డెంకాడ ఆనంద్, రాజేంద్రప్రసాద్, కిశోర్, లలిత, జె.శ్యామల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం


విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మరో మంత్రి సంధ్యారాణి, నేతలు

మహారాణిపేట: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సన్‌ రే విలేజ్‌ రిసార్ట్స్‌లో శనివారం జరిగిన జస్టిస్‌ డి.రమేష్‌ కుమార్తె వివాహానికి రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఇదిలా ఉండగా ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి విమానంలో వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో మంత్రి జి.సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్‌ తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమాలు ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 12.55 గంటలకు విమానంలో నారా లోకేష్‌ విజయవాడ వెళ్లారు.

ఘనంగా రాధాకృష్ణ మహోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న పండితులు


గోపూజ చేస్తున్న హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులో జరుగుతున్న శ్రీరాధాకృష్ణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం అధివాసాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధులు అంబరీష దాస, యదురాజ దాస మాట్లాడుతూ ప్రాణప్రతిష్ఠ అంటే దేవతా మూర్తి పవిత్ర స్వరూపంలో ప్రాణశక్తిని స్థాపించే ఆచారమన్నారు. ప్రతిష్ఠ అంటే పవిత్రం చేయడం, స్థాపన చేయడం, శాశ్వత స్థానంలో ఉంచడం అని వివరించారు. ఉత్సవాల్లో ముందుగా వేద పండితులు శాస్త్రాల ప్రకారం గోపూజ నిర్వహించారు. సాయంత్రం ధాన్యాధివాసం, జలాధివాసం, ఛాయాధివాసం, క్షీరాధివాసం వంటి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో హరేకృష్ణ మూవ్‌మెంట్‌ ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస, బెంగళూరు ఇస్కాన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ వాసుదేవ కేశవ ప్రభు, విశాఖ శాఖ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస, దాదాపు 400 మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు.

'గాదె'కు వ్యాయామ ఉపాధ్యాయుల మద్దతు


సంఘీభావం ప్రకటిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడుకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్‌ నాయకులు వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా కమిటీల సమావేశం శనివారం రాత్రి పెందుర్తి సుజాతానగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. రాష్ట్ర అసోసియేషన్‌ సలహాదారు సుందరరావు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులంతా తమ ఐక్యతను చాటేలా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న గాదె శ్రీనివాసులు నాయుడుకు ఉత్తరాంధ్రలోని వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా కమిటీలన్నీ ఏకగ్రీవంగా సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. గాదె శ్రీనివాసులు నాయుడుకు గెలుపునకు కృషి చేయాలన్నారు. విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. అప్పలరాజు, ఎన్‌. లలిత్‌ కుమార్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంకు ఆరు జిల్లాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారం కోసం శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ గాదె గెలుపు ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

మెరుగైన జీవనశైలితో క్యాన్సర్‌కు చెక్‌

- వ్యాధిపై విస్తృత అవగాహన అవసరం
- సినీ నటి, లైఫ్‌ ఎగైన్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు గౌతమి
- నేడు బీచ్‌రోడ్డులో పింక్‌ సఖి శారీ వాక్‌

ఏయూక్యాంపస్‌ : క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సినీ నటి, లైఫ్‌ ఎగైన్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు గౌతమి తాడిమల్ల అన్నారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో విస్తృతంగా క్యాన్సర్‌ అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌తో పోరాడి గెలిచిన వారికి చూసి స్ఫూర్తిని పొందాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించే పింక్‌ సఖి శారీ వాక్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ క్యాన్సర్‌ నివారణ, ప్రాథమిక దశలో గుర్తించడం, సరైన చికిత్స పొందడం, భయాన్ని విడిచిపెట్టడం ఎంతో అవసరమన్నారు. మంచి ఆరోగ్య అలవాట్లను కలిగి ఉండాలన్నారు. ప్రజల్లో క్యాన్సర్‌ పట్ల చైతన్యం పెంచాలన్నారు. తన కుటుంబంలో సైతం క్యాన్సర్‌ బారిన పడిన వారు ఉన్నారన్నారు. క్యాన్సర్‌ వ్యాధికి ఆన్సర్‌ (సమాధానం) ఉందన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, జనసమ్మర్థంగా ఉండే స్థలాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. యాంకర్, సినీ నటి శిల్పా చక్రవర్తి మాట్లాడుతూ తన తల్లికి క్యాన్సర్‌ సోకిన సందర్భాన్ని వివరిస్తూ, విద్యావంతుల్లో సైతం వ్యాధి పట్ల అవగాహన తక్కువగా ఉంటోందన్నారు. ఇటువంటి సమాజ ఉపయుక్త కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్నిస్తోందన్నారు. కాగా.. ఈ కార్యక్రమాన్ని రోహిత్‌ మెమోరియల్‌ ట్రస్ట్, రౌండ్‌ టేబుల్‌ లేడీస్‌ సర్కిల్‌ సంయుక్తంగా నిర్వహిస్తున్నా యి. ఉదయం 6 గంటలకు బీచ్‌రోడ్డు విశ్వప్రియ ఫంక్షన్‌ హాల్‌ నుంచి శారీ వాక్‌ ప్రారంభమవుతుంది.

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, రోహిత్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ జి.అనంత రామ్, ఉపాధ్యక్షురాలు డాక్టర్‌ మీనాక్షి అనంతరామ్, డైరెక్టర్‌ ప్రాజెక్ట్‌ (ఆర్‌ఎంటీ) గుర్మీత్‌ కోహ్లీ, శ్రావణ్‌ షిప్పింగ్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌ ఎండీ డాక్టర్‌ జి.సాంబ శివ రావు, గురుద్వార సాథ్‌ సంగత్‌ అధ్యక్షుడు డాక్టర్‌ డీఎస్‌ ఆనంద్, ఏజ్‌ కేర్‌ ఫౌండేషన్‌ మేనేజింగ్‌ ట్రస్టీ డాక్టర్‌ ఎస్‌.ఎస్‌ రాజు, ఆళ్వార్‌దాస్‌ గ్రూప్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఎస్‌పీ రవీంద్ర, డాక్టర్‌ సీత కల్యాణి, డాక్టర్‌ ఎ.సుగంధి తదితరులు ప్రసంగించారు.

గాజువాక పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం


పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

గాజువాక : మినిస్ట్రీ ఆఫ్‌ హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ విభాగానికి చెందిన పాపులేషన్‌ రీసెర్చ్‌ కమిటీ (కేంద్ర బృందం) గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను సందర్శించింది. డాక్టర్‌ వై.రమణ, డాక్టర్‌ సీహెచ్‌.పాదాలు నేతృత్వంలో పీహెచ్‌సీకి వచ్చిన బృందం.. ఓపీ రిజిస్టర్, డిస్పెన్సరీ, స్టోర్‌ రూమ్, ల్యాబ్‌లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, డెలివరీ రూమ్‌తోపాటు ఇన్‌పేషెంట్‌ విభాగంలో ఫీమేల్, మేల్‌ వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మందులను నిల్వ ఉంచిన గదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మందులను ఎప్పటికప్పుడు సరి చూసుకోవడంతో పాటు ఇండెంట్‌ చేసుకోవాలని సూచించారు. అనంతరం సీనియర్‌ అసిస్టెంట్‌ రికార్డులను పరిశీలించారు. బడ్జెట్, బడ్జెట్‌ రిలీజ్, ఖర్చుల స్టేట్‌మెంట్‌లను పరిశీలించారు. డీఎం అండ్‌ హెచ్‌వో కార్యాలయానికి చెందిన అధికారులు శశిభూషణ్, మురళీకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుధాకర్, డాక్టర్‌ బద్రి నారాయణమూర్తి, సీహెచ్‌వో పి.నాగ అప్పారావు ఇక్కడి కార్యక్రమాలను బృందానికి వివరించారు. ఈ సందర్భంగా వైద్య బృందం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు.

జీబీ సిండ్రోమ్‌ రోగులకు మెరుగైన వైద్యం

మహారాణిపేట: కేజీహెచ్‌లో జీబీఎస్‌ (గులియన్‌ బారే సిండ్రోమ్‌) వ్యాధితో బాధపడుతున్న ఐదుగురు రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి. శివానంద తెలిపారు. జనరల్‌ మెడిసిన్‌ వార్డులో చికిత్స పొందుతున్న వీరిని డిప్యూటీ సివిల్‌ సర్జన్‌ ఆర్‌ ఎంవో డాక్టర్‌ మెహర్, డిప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ వాసవిలతో కలిసి పరామర్శించారు. రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

మత్తులో పడితే జీవితాలు చిత్తు

విద్యార్థులకు సీపీ బాగ్చి హెచ్చరిక

పీఎంపాలెం: ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఎంతో నష్టం కలిగించే మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నగర పోలీస్‌ కమిషనర్‌ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 6వ వార్డులోని బాబా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్సెస్‌ కళాశాలలో శనివారం జరిగిన 'యాంటీ డ్రగ్‌ ఎడిక్షన్‌ అవేర్‌నెస్‌' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్‌ విద్యార్థులు సివిల్‌ సర్వీసెస్‌ను టార్గెట్‌గా చేసుకుని పట్టుదలగా చదవాలని సూచించారు. దేశమంతటా డ్రగ్స్‌ మహమ్మారి వ్యాపించిందని, ఒకసారి డ్రగ్స్‌ తీసుకుంటే.. దానికి బానిసలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే అటువైపు కన్నెత్తి కూడా చూడరాదన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటే శ్వాస కోశ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు.

సంతానోత్పత్తి సామర్థ్యం క్షీణించడంతో పాటు నాడీ వ్యవస్థ దెబ్బతిని మానసిక వ్యవస్థపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. మత్తు పదార్థాలు అమ్మడం, కలిగి ఉండటం నేరమన్నారు. అటువంటి వారు పోలీసులకు పట్టుబడితే 10 నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష నుంచి 2 లక్షల జరిమానాను న్యాయస్థానం విధిస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించి వివరాలు తెలిస్తే 79950 95799/1972 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సీఏల పాత్ర కీలకం

కౌన్సిల్‌ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్‌


మాట్లాడుతున్న కౌన్సిల్‌ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్‌

మద్దిలపాలెం: భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ పాత్ర కీలకమని చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ ఆఫ్‌ ఇండియా కౌన్సిల్‌ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్‌ అన్నారు. మద్దిలపాలెంలో చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ ఆఫ్‌ ఇండియా విశాఖపట్నం బ్రాంచ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 4.30 లక్షల మంది చార్టర్డ్‌ అకౌంటెంట్స్, 8 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ ఆఫ్‌ ఇండియా కార్యవర్గంలో 40 మంది ఎన్నికవ్వగా.. అందులో 8 మందిని కేంద్ర ప్రభుత్వం కౌన్సిల్‌ సభ్యులుగా నియమించిందని వెల్లడించారు. 2017లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీపై చాలా మందికి అపోహలు ఉండగా, వాటన్నింటినీ చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ నివృత్తి చేశారని గుర్తు చేశారు. తద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సీఏలు దోహదపడ్డారన్నారు. వికసిత్‌ భారత్‌ 2047 బృహత్తర కార్యక్రమానికి చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ కీలక భూమిక పోషిస్తున్నట్లు తెలిపారు. చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ ఆఫ్‌ ఇండియా 1949లో ఏర్పాటైందని, విశాఖపట్నంలో 1977లో బ్రాంచ్‌ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ఆదాయపు పన్ను బిల్లుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వడానికి చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. అనంతరం తెలుగు రాష్ట్రాల చార్టర్డ్‌ అకౌంటెంట్లు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు.

80శాతం వరకు తగ్గింపుతో బ్రాండెడ్‌ వస్త్రాలు

రాంనగర్‌లో 3 రోజుల అమ్మకపు ప్రదర్శన


దుస్తులు కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు

బీచ్‌రోడ్డు: రాంనగర్‌లోని ఫోర్‌ పాయింట్స్‌ బై షేరటాన్‌ హోటల్‌లో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనకు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ బ్రాండెడ్‌ వస్త్రాలను 80 శాతం వరకు తగ్గింపుతో శనివారం నుంచి అమ్మకం ప్రదర్శన ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బ్రాండెడ్‌ షార్ట్స్‌ రూ.1,200, లేడీస్‌ కుర్తీ రూ.600, లేడీస్‌ మిక్స్‌ గార్మెంట్స్‌ రూ.300–600, టీ–షర్ట్‌ రూ.550–800, మెన్స్‌ బ్రాండెడ్‌ జీన్స్‌ రూ.1,500, లేడీస్‌ బ్రాండెడ్‌ జీన్స్‌ రూ.600కే అందిస్తున్నామన్నారు. 35 పైగా కౌంటర్లలో 30,000+ దుస్తులు ప్రదర్శనలో ఉంచామని వెల్లడించారు. ప్యూమా, అడిడాస్, ఫీలా, క్లార్క్స్, హెచ్‌ఆర్‌ఎక్స్‌ మిక్స్‌ తదితర బ్రాండ్ల షూలు ఒరిజినల్‌ ధర రూ.2,000 నుంచి రూ.12,000 వరకు కాగా.. ప్రత్యేక కౌంటర్లలో వాటిని కేవలం రూ.800 నుంచి రూ.1,800 వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఆది, సోమవారాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని, నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గాజువాకలో మధ్యప్రదేశ్‌ వ్యక్తి ఆత్మహత్య

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాజువాక ఎస్‌ఐ నజీర్‌ తెలిపిన వివరాలివీ.. భెల్‌(హెచ్‌పీవీపీ)లో సబ్‌ జెట్‌ కాంట్రాక్ట్‌ విభాగంలో సిబ్బందికి మధ్యప్రదేశ్‌కు చెందిన చైన్‌ పాల్‌సింగ్‌(32) ఆహారం అందజేసే పనులు నిర్వహిస్తున్నాడు. తన మేనేజర్, మరో ముగ్గురితో కలిసి గాజువాకలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాడు. పాల్‌సింగ్‌కు తన భార్యతో గొడవలు ఉన్నాయని, మధ్యప్రదేశ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నడుస్తోందని సహోద్యోగులు తెలిపారు. కాగా.. శనివారం మధ్యాహ్న సమయంలో చైన్‌ పాల్‌సింగ్‌కు ఆహారం ఇవ్వడానికి డ్రైవర్‌ శ్రీధర్‌ ఫ్లాట్‌కు వెళ్లాడు. ఫ్లాట్‌ తలుపులు కొట్టి పాల్‌సింగ్‌ను పిలవగా, ఎంతకీ తలుపులు తెరవలేదు. దీంతో అనుమానం వచ్చి కిటికీలోంచి తలుపును తోసి లోపల చూశాడు. పాల్‌సింగ్‌ లుంగీతో ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో వెంటనే సహోద్యోగులకు విషయం తెలిపాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. డ్రైవర్‌ శ్రీధర్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.